క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


బెనర్జీ వీధిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

జంగారెడ్డిగూడెం: స్థానిక 24వ వార్డులోని బెనర్జీ వీధి, పరిసర ప్రాంత ప్రజలకు లోవోల్టేజ్ సమస్య తీరింది. శనివారం ఆ ప్రాంతంలో విద్యుత్‌శాఖాధికారులు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. వార్డు కౌన్సిలర్ దొంతుమాధవ్ మాట్లాడుతూ లోవోల్టేజ్ సమస్యను చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖాధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించడంతో శనివారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారని తెలిపారు. నాయకులు, అధికారులకు కౌన్సిలర్ దొంతు మాధవ్, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి వితరణ


సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుక్కునూరు: మండలంలోని ఇబ్రహీంపేట గ్రామంలో ఇళ్లు కాలిపోయి నిరాశ్రయులైన సచివాలయ గృహసారధి పేట ప్రశాంతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, గణపవరం సర్పంచ్ తుర్సం నరేష్, ఉపసర్పంచ్ ఎల్లంకి లక్ష్మణ్‌రావులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పీవోడబ్ల్యూ నాయకుల ర్యాలీ

జంగారెడ్డిగూడెం: అక్రమంగా అరెస్టు చేసిన ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం నాయకురాలు పూనెం పార్వతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జంగారెడ్డిగూడెంలో ఆందోళన, ర్యాలీ నిర్వహించారు. పీవోడబ్ల్యూ నాయకులు విష్ణు, సంధ్య, పద్మక్క, సుందరక్క, మరి కొందర్ని తప్పుడు కేసులతో అరెస్టు చేశారని తెలిపారు. వారిపై ఉపా చట్టాలను ప్రయోగించడం సరికాదన్నారు. వెంటనే నాయకులను విడుదల చేసి వారిపై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సోడే నర్సమ్మ, సోడే ముక్కమ్మ, విజయలక్ష్మి, కుమారి, భూ లక్ష్మి, కమల పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే ప్రారంభం


డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బుట్టాయగూడెం: మండలంలోని రాజానగరంలో శనివారం జగనన్న భూరక్ష కార్యక్రమంలో భాగంగా డ్రోన్ సర్వేను జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ కుంజా దుర్గమ్మలు ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారని వారు తెలిపారు. సమగ్రమైన రికార్డులను తయారు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఈ సర్వేలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సచివాలయ కన్వీనర్ రమణా నాగు, కుంజా శిరమయ్య, మండల సర్వేయర్, వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు

ద్వారకాతిరుమల: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిపై శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎం.నాగులపల్లికి చెందిన భార్యభర్తలు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. శనివారం ఉదయం ఇంట్లో వారి కుమార్తె ఒక్కతే ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన యంత్రపాటి అచ్యుతరావు వెళ్లి ఆమె చెయ్యి పట్టుకుని, చున్నీ లాగబోయాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో అచ్యుతరావు ఆమె సెల్‌ఫోను పట్టుకుని పరారయ్యాడు. అనంతరం ఆ ఫోన్‌ను రమేష్ అనే వ్యక్తికి ఇచ్చి బాలిక ఇంటికి పంపించేశాడు. విషయాన్ని బాలిక తన తండ్రికి చెప్పింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

డయేరియాపై అవగాహన

చింతలపూడి: డయేరియాపై తల్లులకు అవగాహన కల్పించాలని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్కే అబ్రార్ హుస్సేన్ అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో శనివారం ఐడీసీఎఫ్ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని హుస్సేన్ వివరించారు. పక్షోత్సవాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు డయేరియాపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ భరత్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త నర్మద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యలో రాణింపునకు ఆణిముత్యాలు దోహదం


జంగారెడ్డిగూడెంలో విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేసిన దృశ్యం


రావికంపాడులో విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు


కొయ్యలగూడెంలో విద్యార్థులను సన్మానించిన ప్రజాప్రతినిధులు

విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రోత్సాహకాల అందజేత

జంగారెడ్డిగూడెం: విద్యార్థులను పోత్సహిస్తూ.. విద్యలో మరింతగా రాణించేందుకు జగనన్న ఆణిముత్యాలు పథకం దోహదపడుతుందని జెడ్పీ హైస్కూల్ బాయ్స్ విద్యాకమిటీ అధ్యక్షుడు పచ్చిపాల మృత్యుంజయరాజ్ అన్నారు. జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు బహూకరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మృత్యుంజయరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి అనుక్షణం తపించే ముఖ్యమంత్రి ఉండటం మన అదృష్టమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మదిలో మెరిసిన జగనన్న ఆణిముత్యాలు పథకం విద్యార్థుల్లో నూతన ఉత్సాహం నింపడంతో పాటు పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు దోహదపడుతుందని చెప్పారు. ఈ హైస్కూల్లో పదో తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కొల్లేపర మోహనచంద్ర, మట్టపర్తి చరణ్ సాయి పవన్, బోళ్ల దూండీ మహేష్ కుమార్‌లకు బంగారు, రజిత, కాంస్య పథకాలతో పాటుగా మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు లోవ కుమారి మాట్లాడుతూ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నగదు ప్రోత్సాహాలు ఉన్నాయని రాష్ట్రస్థాయిలో రూ.లక్ష బహుమతి ఉందన్నారు. పోటీ తత్వంతో చదవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ డి.జగదీష్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ఎస్.దుర్గాదేవి, పి.రాంబాబు, ఎం.సుందరి, బి.శ్రీనివాస్, ఎంఏ నబీ, పి.ఉషశ్రీ, కె.రవికుమార్, ఐవీఎస్ఆర్‌కే ప్రసాద్, పీడీ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కామవరపుకోట: పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తోన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు అన్నారు. పాఠశాలలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి, రెండు, మూడు స్థానాలు సాధించిన సింగంశెట్టి సంజన కావ్య, ఉషా హర్షిత మణిలక్ష్మి, షేక్ అయిషా పర్వీన్, మల్లిశెట్టి రేష్మ జగదీశ్వరిలకు ప్రభుత్వ అందించిన మెడల్స్, ప్రశంసాపత్రాలను శనివారం ఆయన అదజేశారు. విద్యార్థులను ప్రోత్సహించడం వల్ల ఎంతో మంచి ఫలితాలు పొందవచ్చునని, విద్యార్థులు పోటీతత్వం పెంచుకోవాలని, ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్నీ సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్న స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డు రాములు, బిరుదుగడ్డ నాగేశ్వరరావు, చైతన్య పాల్గొన్నారు.

విద్యా సరస్వతులకు సన్మానం

కొయ్యలగూడెం: విద్యా సరస్వతులను సన్మానించడం సంతృప్తిగా ఉందని జిల్లా విద్యా, వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శనివారం పరింపుడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె ఎంపీపీ గంజిమాల రామారావుతో కలిసి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. బాలుర హైస్కూల్లో విద్యార్థులను సన్మానించారు. జగనన్న ఆణిముత్యాలు మండలం విద్యా మణి మకుటాలుగా నిలిచారన్నారని ఎంపీపీ రామారావు పేర్కొన్నారు. కన్నాపురం, రాజవరం, గవరవరం, వేదాంతపురం, హైస్కూళ్లలో పదో తరగతి టాపర్స్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. కొయ్యలగూడెం సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్టా వనజ లక్ష్మి, ఎంపీటీసీలు గంటా శ్రీనివాస్, ఘంటసాల శీనమ్మ, సర్పంచులు పాల్గొన్నారు. కాగా సమాచార లోపం కారణంగా కొందరు ప్రజాప్రతినిధులు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలకు హాజరుకాలేకపోమని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను కొందరు విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల విమర్శలకు తావు ఇస్తున్నాయని పలువురు వాపోయారు.

ఖైదీలకు చట్టాలపై అవగాహన

చింతలపూడి: స్థానిక సబ్ జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు శనివారం సందర్శించారు. ఖైదీలను ఆహారం, వసతి, వైద్య సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థోమత లేని నిందితులు, శిక్షలు పడి అప్పీలు చేసుకునే అవకాశం లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి న్యాయ సహాయం అందజేస్తామని చెప్పారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కోర్టు ఆవరణలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో జడ్జి సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు బడికి వెళ్లకుండ హోటళ్లలో, పరిశ్రమల్లో, ఇళ్లలో పనికి వెళ్తుంటే వారిని గుర్తించి బడికి పంపాలని ఆదేశించారు. ఆరేళ్ల నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి పనికి వెళ్లే పిల్లల వివరాలను కోర్టుకు తెలపాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీపీ సోమయ్య, సబ్‌జైల్ సూపరింటెండెంట్ జి.వెంకటేశ్వరరావు, సోషల్ వర్కర్ అక్బర్ అలి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సారా సీజ్.. ఇద్దరి అరెస్ట్

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. 45 లీటర్ల సారా సీజ్ చేసి, చిక్కాల సత్యనారాయణ, పేర్ని చిన్న శ్రీను అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు. సారా తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాబ్జి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

జంగారెడ్డిగూడెం రూరల్: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి సూచించారు. జంగారెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ ఉపాధ్యక్షుడే నరెడ్ల బుజ్జిబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామాల్లో బెల్ట్‌షాపులు, నాటు సారా విక్రయాలపై అధికారులు చర్యలు చేపట్టడం లేదని, లక్కవరం, పేరంపేట గ్రామాల్లో తీవ్రమైన విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. మండల పరిషత్ సమావేశ అజెండా కాపీలను అధికారులు ఇవ్వడం లేదంటూ ఆరోపించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాబ్జి మాట్లాడుతూ సమావేశాల అజెండా కాపీలను ప్రజాప్రతినిధులకు అందజేయాలన్నారు. సంక్షేమ పథకాలను సక్రమంగా అందిస్తూ ప్రభుత్వానికి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మంచి పేరు తీసుకురావాలని కోరారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైస్ ఎంపీపీ బుజ్జిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్, తహసీల్దార్ స్లీవజోజి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

పోలవరం రూరల్: మండలంలోని అధికారులు ప్రజాసమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజా ప్రతినిధులతో సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ మురుగునీరు పోయేందుకు డ్రెయిన్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని కోరారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారులు అభివృద్ధి పనులను వివరించారు. డ్రెయిన్‌లు, మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు అంచనాలను ముందుగా ఇంజినీరింగ్ అధికారులు తయారు చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.శ్రీను, తహసీల్దార్ బి.సుమతి, పీఆర్ డీఈ సీతయ్య, మైనర్ ఇరిగేషన్ డీఈ కేవీ ప్రసాద్, ఎంపీటీసీలు బుగ్గా మురళీకృష్ణ, కాశి ధనలక్ష్మి, దాపర్తి మోహన్‌రావు, సోమరౌతు అనితకుమారి, వలవల వరలక్ష్మి, కుంజం చిట్టెమ్మ, మాడే ఆనంద్, మిడియం సింగరాజు, సర్పంచ్‌లు మైగాపుల విజయదుర్గ, కె.వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మానసిక సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెం.14416


కూలీలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న తిరుపతిస్వామి

లింగపాలెం: మానసిక వ్యాధులపై ప్రజలకు జిల్లా మెంటల్ హెల్త్ ప్రోగ్రాం సైకియాట్రిక్ సోషల్ వర్కర్ ఎల్ తిరుపతిస్వామి అవగాహన కల్పించారు. శనివారం లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామంలో ఉపసర్పంచ్ ఎల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మానసిక వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తీ ఒత్తిడి, ఆందోళన, దిగులు, నిద్రలేకపోవటం, మతిమరుపు, స్కిజోఫ్రేనియా, డ్రగ్స్ వంటి వ్యాధుల వల్ల ఆత్మహత్య ఆలోచనలు కల్గిస్తాయన్నారు. వీటి యొక్క లక్షణాలు, ఈ వ్యాధులు రావడానికి గల కారణాలు, పరిష్కార మార్గాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మానసిక సమస్యలతో బాధపడేవారు 14416 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి కౌన్సిలింగ్ తీసుకోవడం ద్వారా మానసిక సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు.

'బేటీ బచావో – బేటీ పడావో'లో భాగస్వాములుకండి


చీమలవారిగూడెంలో ప్రీస్కూల్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: సమాజ మార్పు కోసం ఉద్దేశించి ఏర్పాటు చేసిన బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని చీమలవారిగూడెంలో శనివారం బుట్టాయగూడెం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమాజంలో మార్పు రానంతకాలం ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోలేవన్నారు. జెడ్పీటీసీ మొడియం రామతులసి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణపై మరింత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సీపీడీఓ ఇ.తులసి మాట్లాడుతూ బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని కేఆర్‌పురం సచివాలయ పరిధిలోని కేఆర్‌పురం సెక్టార్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలకు ప్రీస్కూల్ పుస్తకాలను ఎంపీడీఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉయికే బొజ్జి, డాక్టర్ అనూష, హెచ్‌వీ రామతులసి, ఆశ వర్కర్లు, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

జేవీకేను సద్వినియోగం చేసుకోండి


సుబ్బరాజు హైస్కూల్లో జేవీకే కిట్లను అందిస్తున్న దృశ్యం


ఎన్ఆర్‌పాలెం పాఠశాలలో ప్రోత్సాహక నగదు అందజేస్తున్న మోహన్‌రావు

చింతలపూడి: జగనన్న విద్యా కానుకను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ విద్యార్థులకు సూచించారు. స్థానిక సుబ్బరాజు ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న విద్యాకానుక కిట్లను తల్లుల సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. సీఎం జగన్ విద్యా రంగానికి ఇస్తోన్న ప్రాముఖ్యతను ఎంపీపీ కొనియాడారు. ప్రభుత్వం కల్పిస్తోన్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇంగ్లిష్ మీడియంతో అంతర్జాతీయ స్థాయిలో పేద విద్యార్థులు పోటీపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం జగన్‌మోహన్‌రెడ్డిని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ దుర్గారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ కాంతారావు, పార్టీ నాయకులు సొంతి ఖన్నా, ప్రసాదరాజు, బోడా బాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించేందుకు కృషి

బుట్టాయగూడెం: మండలంలోని నూతిరామన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్ పాడియం లక్ష్మి చేతుల మీదుగా జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. చెప్పినట్టుగానే పాఠశాల ప్రారంభించేనాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు, బ్యాగ్‌లు అందేవిధంగా కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థి అరగంటి నాగేంద్రకుమార్‌రెడ్డికి వైస్ ఎంపీపీ మోహన్‌రావు రూ.2000 ప్రోత్సాహక బహుమతి అందించారు. ఇంటర్ పూర్తయ్యే వరకు విద్యార్థికి తనవంతు సహకారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పెంటపాటి శ్రీను, స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నీట్ విజేత హేమ వైష్ణవికి అభినందన


హేమ వైష్ణవిని సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: నీట్, ఏపీ, టీఎస్ ఎంసెట్లలో విశేష ప్రతిభ కనబర్చిన జంగారెడ్డిగూడెంకు చెందిన గంటా వైష్ణవిని శనివారం రోటరీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్ష కార్యదర్శులు దాకారపు కృష్ణ, ఉడా రాంగోపాల్ మాట్లాడుతూ హేమ వైష్ణవి నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో ఆలిండియా 115 ర్యాంకు (ఓపెన్ కేటగిరిలో 89వ ర్యాంక్), ఆంధ్రప్రదేశ్ ఎంసెట్‌లో 83వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 85వ ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. వైష్ణవి ఎన్నుకున్న లక్ష్యం చేరుకునేందుకు వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులు గంటా రామభాస్కరరావు, సురేఖ దంపతుల కృషిని కొనియాడారు. ప్రముఖ వైద్యుడు కాకర్ల రామచంద్రబాబు మాట్లాడుతూ కష్టంగా కాక ఇష్టంగా చదివితే గెలుపును సునాయాసంగా అందుకోవచ్చని వైష్ణవి నిరూపించిందన్నారు. రోటరీ చార్టర్ సభ్యులు చామర్తి శ్రీరాములు మాట్లాడుతూ ఒత్తిడిని దరిచేరకుండా చేసుకోవడం విజయానికి మార్గమని వైష్ణవి ఆచరించి చూపిందన్నారు. వైష్ణవిని అభినందన అందించిన రోటరీకి ఆమె తండ్రి రామ భాస్కరరావు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పుష్పమాలలు, దుశ్శాలువాతో వైష్ణవిని సత్కరించి రోటరీ ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కేఎల్ఎన్ ధనకుమార్, కొమ్ముకూరి నాగేశ్వరరావు, బవిరిశెట్టి హనుమాన్ తిలక్, మాణికల గంగాధర్, వైష్ణవి కుటుంబీకులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి


మద్దులగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పడం ద్వారా వారిలో మానసిక వికాశం పెంపొందుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మీరాజ్యం అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి, రామసింగవరం, మద్దులగూడెం గ్రామాల్లో శనివారం జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ మూడేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం వల్ల బాల్య దశలోనే ఆటపాటలతో పాటు పీ1, పీ2 వర్క్ బుక్స్ ద్వారా వారు మానసికంగా ఎదుగుతారని చెప్పారు. పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, అంగన్‌వాడీ సిబ్బంది కె.సుధ, జాన్సి, సుబ్బాయమ్మ, కె.విజయనిర్మల, ఎం.జగదీశ్వరి, ఎం.సరస్వతి, రామలక్ష్మి, నాగమణి, సీహెచ్ కుమారి, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు చేయండి


ఇసుక కాలువను పరిశీలిస్తున్న ఎంపీపీ, డీఈ

పోలవరం రూరల్: కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మైనర్ ఇరిగేషన్ డీఈ కేవీ ప్రసాద్‌కు సూచించారు. ఆయన శనివారం వింజరం గ్రామంలోని గోవిందరాజుల చెరువును పరిశీలించారు. చెరువు నుంచి దిగువకు చేరే కాలువ, ఇసుక కాలువ, కడెమ్మ కాలువలను పరిశీలించారు. కాలువలో నీరు పారుదలకు పలుచోట్ల తూడు ఆటంకంగా మారిందన్నారు. గతంలో భారీ వర్షాలకు ఇసుక కాలువ రెండు సార్లు పొంగిందని గుర్తుచేశారు. ఇటికిలకోట గ్రామం ముంపు సమస్యను ఎదుర్కొందని, మరలా అటువంటి పరిస్థితి తలెత్తకుండా చూడాలని అన్నారు.

కోళ్ల దొంగలకు దేహశుద్ధి

కామవరపుకోట: కోళ్ల దొంగలను పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన కామవరపుకోట మండలం గొల్లగూడెంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కామవరపుకోట మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన మానికల పండు పామాయిల్ తోటలో ముగ్గురు యువకులు శనివారం తెల్లవారుజామున కోళ్లు దొంగతనం చేస్తుండగా స్థానికులు గమనించారు. వారు పారిపోతుండగా పట్టుకుని దేహశుద్ధి చేశారు. వారు జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన వారని గుర్తించారు. వీరిని టి.నర్సాపురం మండలం సాయంపాలెం ఒక పామాయిల్ తోటలో ఉంచినట్టు సమాచారం. పోలీసులకు అందిన సమాచారంతో వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

దుర్గారెడ్డి ఆచూకీ లభ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: కనిపించకుండాపోయిన మండలంలోని లక్కవరానికి చెందిన దల్లి దుర్గారెడ్డి ఆచూకిని పోలీసులు కనుగొన్నారు. కేరళ రాష్ట్రంలోని ఒక పట్నంలో దుర్గారెడ్డి ఉన్నట్టు గుర్తించారు. ఈనెల 15 నుంచి దుర్గారెడ్డి కనిపించక పోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లక్కవరంలో ఎర్రకాలువ ప్రధాన వాగు ఒడ్డున దుర్గారెడ్డి చెప్పులు, ద్విచక్ర వాహనాన్ని గుర్తించిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. దుర్గారెడ్డి కేరళా రాష్ట్రం నుంచి బయలు దేరాడు. రేపటికి లక్కవరం చేరుకుంటాడని తెలిసింది. పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

20న దివ్యాంగుల గుర్తింపు శిబిరం

లింగపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న మంగళవారం ఉదయం 10 గంటలకు దివ్యాంగుల ఉపకరణములు, సహాయక పరికరాలకు ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్టు జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరానికి సదరం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని, అవసరమైన పరికరాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆర్థిక సాయం


రమేష్ వైద్యానికి సాయం అందిస్తున్న ఆటో డ్రైవర్లు

కొయ్యలగూడెం: ప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితమైన టాటా మ్యాజిక్ డ్రైవర్ గోడ రమేష్‌కి శనివారం టాటా మ్యాజిక్ డ్రైవర్ల సంఘం సభ్యులు రూ.40 వేలు సాయం అంకాలగూడెంలోని అతని నివాసంలో అందజేశారు. రమేష్ ప్రమాదానికి గురవడంతో సంవత్సరం పాటు బెడ్ రెస్ట్ అవసరమని వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న స్నేహ మిత్ర టాటా మ్యాజిక్, కొయ్యలగూడెం ఏపీ స్టేట్ టాటా మ్యాజిక్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ అసోసియేషన్ నాయకులు ఏసు, కొయ్యలగూడెం స్నేహ మిత్ర టాటా మ్యాజిక్ యూనియన్ ప్రెసిడెంట్ ధనరాజ్, వైస్ ప్రెసిడెంట్ ధూళిపాల సత్యనారాయణ, క్యాషియర్ దార్ల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రటరీ వెంకట్, సభ్యులు పాల్గొన్నారు.



